కథ

# వియ్యపురాలికి ప్రేమలేఖ

**శ్రీమతి రత్నవల్లిగారికి జానకి నమస్కరించి వ్రాయునది. 'ఈ జానకి ఎవరు?' అని ఆశ్చర్యపోతున్నారా? నేను ఒక అబ్బాయి తల్లిని. మీరు మాతో వియ్యానికి ఒప్పుకొంటే వియ్యపురాలిని అయ్యే అవకాశం ఉంది. కంగారు పడకుండా నిదానంగా చదవండి.**

మీ అమ్మాయి రాధను నేను చూడలేదు. కానీ మా అబ్బాయి భార్గవ చెప్పేడు చాలా బాగుంటుందట. మా అబ్బాయి భార్గవ డాక్టరు. భార్గవ నాన్నగారు, నేను ఈరోజు వాడి పెళ్ళి విషయం ప్రస్తావించాము.

''నాకు ఇప్పుడు ముఖ్యమైన పని ఉంది నాన్నగారూ. సాయంకాలం ఏ విషయం చెబుతాను'' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ ముఖ్యమైన పని మీ అమ్మాయి రాధను కలవడం అని తరువాత భార్గవ మాటలను బట్టి అర్థం అయ్యింది.

రత్నవల్లిగారూ! మీరు ఈ లెటరు చదువుతూ మధ్యలో ఆపి మీ అమ్మాయిని మందలించే ప్రయత్నం చెయ్యవద్దు. నిదానంగా మొత్తం చదివిన తరువాత ఒక అభిప్రాయానికి రండి. పిల్లలూ మనంతటివాళ్లు అయ్యారు. వాళ్ల అభిప్రాయాలను గౌరవించడం ద్వారా వాళ్లకు మనం దగ్గర అయ్యి మనస్సులో మాట తెల్సుకోవాలి.

సాయంకాలం భార్గవ నా దగ్గర కూర్చుని నెమ్మదిగా చెప్పిన విషయం..మీ అమ్మాయి రాధ అంటే తనకు చాలా ఇష్టం అట. అందుకే మేము మేరేజ్ ప్రపోజల్ తెచ్చిన వెంటనే ఎటూ మాట్లాడలేక రాధను మీట్ అయ్యి తన అభిప్రాయం అడగాలి అని వెళ్లాడట. అడిగిన వెంటనే రాధ కూడా కంగారు పడిందట.

''ఇంత సడెన్‌గా ఏమీ చెప్పలేను. నాకూ నువ్వంటే చాలా ఇష్టం. కానీ నాన్నగారికి కేస్ట్ ఫీలింగ్ ఎక్కువ. అమ్మ, నాన్నగారు అంటే నాకు ఇష్టంతో కూడిన గౌరవం. వాళ్లు ఏమంటారో అని భయంగా ఉంది'' అని రాధ అందట.

''పోనీ నేను వచ్చి మాట్లాడనా'' అని భార్గవ అడిగాడట.

''వద్దు. వద్దు. కేస్ట్ ఫీలింగ్‌తో నాన్నగారు నిన్ను ఏమన్నా చిన్నబుచ్చుతారేమో. నాకు ఒక వారం రోజులు టైం ఇవ్వు. అమ్మతో చెప్పి ఒప్పించడానికి ట్రై చేస్తాను. మరి మీ ఇంట్లో పరిస్థితి ఏమిటి?'' అని రాధ భార్గవను అడిగిందట.

''మా ఇంట్లో పరిస్థితీ ఇదే రాధా. అమ్మకు నేను ఆలోచించకుండా ఏమీ చెయ్యనని నమ్మకం. నా మాటకు విలువ ఇస్తుంది. అమ్మ మాటకు నాన్నగారు విలువ ఇస్తారు. నాన్నగార్కి కూడా చాలా కేస్ట్ ఫీలింగ్. అమ్మ ఒప్పిస్తుందనే నమ్మకం ఉంది'' అని భార్గవ చెప్పాడుట.

చాలా సేపు చర్చించుకొన్నాక ఫైనల్‌గా ఇద్దరూ నిర్ణయించుకొన్నది ఏమిటంటే ఇద్దరిలో ఎవరి పేరెంట్స్ ఒప్పుకోకపోయినా ఫ్రెండ్స్‌లా విడిపోవాలని.

రాధ అందట. ''భార్గవా. మనల్ని ఎంతో ప్రేమగా పెంచి పెద్దవాళ్లను చేసిన అమ్మ, నాన్నగార్లను మనం కష్టపెట్టకూడదు. వాళ్లు మన మీద ఎన్నో ఆశలు పెట్టుకొంటారు. వాళ్లను నిరాశపర్చకూడదు. వాళ్లు 'ఊ' అంటేనే మనం మేరేజ్ చేసుకొందాం. వద్దు అంటే వాళ్లకోసం మనమే రాజీకి వచ్చి వాళ్లు చెప్పినట్లు నడుచుకోవచ్చు.''

ఈ విషయాలన్నీ భార్గవ నాతో పూసగుచ్చినట్లు చెప్పాడు.

అన్నీ చెప్పిన తరువాత నా అభిప్రాయం అడిగాడు. నేను కూడా ఇందుకు ప్రిపేర్డ్‌గా లేను కదా. అందుకే 'నన్ను కొంచెం ఆలోచించుకోనీ నాన్నా' అని చెప్పాను.

నేను వెంటనే 'ఊ' అంటాను అని ఆశించినట్లున్నాడు. కొంచెం షాక్ అయ్యినట్లు కన్పించాడు.

''నేను నాన్నగారితో ఈ విషయం మాట్లాడి ఒప్పించాలి కదా. నేను ముందుగా 'ఊ' అన్నాననుకో. తర్వాత నాన్నగారు ఒద్దు అంటే నీకు నాన్నగారి మీద ద్వేషం పెరుగుతుంది. అది నాకు ఇష్టం లేదు. అట్లా అని మా గురించి వ్యతిరేకంగా ఆలోచించవద్దు. నాన్నగారిని ఒప్పిస్తానన్న ధైర్యం ఉంది. ఒక్క వారంలో అన్నీ ఒక కొలిక్కి వస్తాయి. ఏమీ కంగారు పడకు'' అని భార్గవకు ధైర్యం చెప్పాను.

ఇప్పుడు రాత్రి పదకొండు గంటలయ్యింది.

భార్గవతో మాట్లాడేటప్పుడు కేజువల్‌గా మీ వివరాలు, ఎడ్రస్ తెల్సుకొన్నాను. కాలం మారిందండీ రత్నవల్లిగారూ. అబ్బాయి అమ్మాయికి, అమ్మాయి అబ్బాయికి ప్రేమలేఖలు వ్రాసుకొనే పద్ధతిపోయి వియ్యపురాళ్లు ప్రేమలేఖలు వ్రాసుకొనే రోజులొచ్చినట్లున్నాయి.

నాకు రాధ మాటలు బాగా నచ్చాయి. తల్లిదండ్రుల కోసం ఇష్టపడిన అబ్బాయిని వదులుకోవడానికి సిద్ధపడింది. పెద్దవాళ్ల మాటలకు విలువ, గౌరవం ఇచ్చే రాధ వ్యక్తిత్వం నన్ను ఆకట్టుకొంది. పెద్దలను గౌరవించే పిల్లలకు అందరినీ మర్యాదగా చూసే స్వభావం ఉంటుంది. రాధ చాలా బాగుంటుంది అని భార్గవ చెప్పాడు. అమ్మాయి అందం వాడి ఒక్కడికే స్వంతం. కానీ అమ్మాయిలో ఉన్న సంస్కారం అందరి స్వంతం. నేను అందాని కన్నా సంస్కారానికి ఎక్కువ విలువ ఇస్తాను. రెండూ ఉన్న రాధను మా ఇంటి కోడలిగా చేసుకోడానికి నాకు ఏమీ అభ్యంతరం కన్పించలేదు.

మీ గురించి నాకు ఏమీ తెలియదు. కానీ ఒక విషయం. అన్నీ చూసి అనుకూలంగా ఉన్న సంబంధం చేస్తాము. కానీ అబ్బాయి మనస్సులోకి తొంగి చూడలేం కదా..మన పిల్లలు టీనేజర్స్ కాదు. కులం పట్టింపులు పెట్టుకోకుండా మనమే ముందుకు వచ్చి ఈ శుభకార్యం జరిపిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. బయట వాళ్ళు ఏదో ఓ కామెంట్ చెయ్యక మానరు. వాళ్ల కామెంట్స్ కంటే మన పిల్లల సుఖం మనకు ముఖ్యం కదా. మీ ఫామిలీ, మా ఫామిలీ ఒక్క మాటగా నిలబడి 'మాకు ఇష్టం అయ్యి చేసుకొంటున్నాము' అని అంటే కామెంట్ చేసే వాళ్ల నోళ్లు ఆటోమేటిక్‌గా మూతపడ్తాయి. మా వారిని ఒప్పించడం అంత తేలిక కాదు. కానీ భార్గవ మీద ఆయనకి ఉన్న ప్రేమ, నా మాట మీద నమ్మకంతో ఒప్పుకొంటారని ఆశ ఉంది.


మాకు మీ నుండి కట్న కానుకలు ఏమీ వద్దు. మా అబ్బాయిని ఇష్టంగా చూసుకొనే మీ అమ్మాయి మా ఇంటి కోడలుగా రావాలి అని ఆశపడ్తున్నాను.

నా దృష్టిలో పెళ్లి అంటే అబ్బాయి, అమ్మాయి ఒకటి అవ్వడం మాత్రమే కాదు. అమ్మాయి కుటుంబం, అబ్బాయి కుటుంబం ఒక్కటిగా కల్సిపోయి ఒకే కుటుంబంలా ఉంటూ మనవంతు సహకారం పిల్లలకు అందించాలని నా

అభిప్రాయం.

మా ఫోన్ నెంబరు, ఎడ్రస్ ఇస్తున్నాను. నా లెటరు అందేసరికి రాధ మీకు ఈ విషయం చెప్పకపోతే మీరే ఈ విషయం రాధతో మాట్లాడండి. రాధని బెదరగొట్టవద్దు మీ వైపు నుండి మంచి వార్త రావాలని ఆశిస్తున్నాను. రాధ నాన్నగారిని కూడా ఒప్పించే ప్రయత్నం చెయ్యండి. అదీ మీ చేతుల్లోనే ఉంది. శనివారం లోపు మీ అభిప్రాయం లెటరు ద్వారా కానీ ఫోను ద్వారా కానీ తెలియపర్చండి.

మీరు 'ఊ' అంటే
వియ్యపురాలు
అయ్యే అవకాశం ఉన్న
జానకి.



లెటరు చదవడం పూర్తి చేసిన నాకు ఒక్క ఐదు నిమిషాలు అంతా అయోమయంగా అన్పించింది. లోకల్ పోస్ట్ అవ్వడం వల్ల ఈవినింగ్ పోస్ట్‌లో వచ్చింది ఆ లెటరు.

రెండు రోజుల తరువాత తనూ జానకికి లెటరు వ్రాసింది. ఫోను చెయ్యవచ్చు కానీ మనస్సులో విషయాలు క్లియర్‌గా తెలియ పర్చడానికి లెటర్ వ్రాయడవే మంచిదన్న అభిప్రాయం కలిగింది రత్నవల్లికి. అందుకే మొదలుపెట్టింది.

శ్రీమతి జానకి వదినగార్కి మీకు వియ్యపురాలు కావాలని ఆశపడే రత్నవల్లి నమస్కారములతో వ్రాయునది.

మీరు రాసిన లెటరు అందుకొని రెండు రోజులు అయ్యింది. ప్రతి అక్షరం లోనూ మీ సంస్కారం కళ్లకు కట్టినట్లుగా కన్పించింది. నిజం చెప్పాలంటే మీ లెటరు కన్నా ముందు రాధ ఈ విషయం చెప్పినట్లయితే నేను ఖచ్చితంగా 'వద్దు' అనేదాన్ని. కానీ మీ మాటలు నన్ను ఆలోచింప చేశాయి.

ముందుగా రాధతో మీరు చెప్పినట్లుగా బెదరగొట్టకుండా మాట్లాడాను. భార్గవ గురించి అంతా చెప్పింది. తరువాత రాధ నాన్నగారిని ఒప్పించడం కొంచెం కష్టమే అయింది. కానీ మీ లెటరు చదివిన తరువాత మీ సంస్కారానికి ముగ్ధులై ఇంక ఏమీ మాట్లాడలేదు. ఇద్దరం కలిసి ఒక నిర్ణయానికి వచ్చాము. మీరు వ్రాసినట్లుగా మనకి ఇష్టమై చేసుకొంటున్నాం అంటే ఆటోమేటిక్‌గా విమర్శించే వాళ్ల నోళ్లు మూతలు పడ్తాయి.

వదినగారూ! మీ అంతట మీరు ముందుకు వచ్చారని మేము చేసేవి ఏమీ మానము. కట్న కానుకలు వద్దు అనడం మీ సంస్కారం అయితే కోరి వచ్చిన వాళ్లను మర్యాద చెయ్యడం ద్వారా మా సంస్కారం నిరూపించుకొంటాం.

మంచి రోజు చూసుకొని మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని ఆహ్వానించి మా మర్యాదలు మేము చేస్తాము. తరువాత మీరు అమ్మాయిని చూసి ఎంగేజ్‌మెంట్ ఏర్పాట్లు చెయ్యండి. మీ వీలును బట్టి ఎల్లా అంటే అల్లా చేస్తాం. మేరేజ్ కూడా ఎక్కడయినా మగపెళ్లివారి పద్ధతిలోనే కదా జరిగేది. అల్లాగే మీ పద్ధతి ప్రకారం చేద్దాం. ఇంకా చాలా వ్రాయాలని ఉంది. నాకు ఇంత మంచి వియ్యపురాలు దొరికినందుకు ఆనందంతో కడుపునిండిపోయింది. మీలాంటి సంస్కారవంతుల కుటుంబంలోకి అడుగుపెడుతున్న మా రాధ చాలా అదృష్టవంతురాలు.

రాధకు చేయించిన వస్తువులు, రాధ పేరున ఉన్న ఆస్తిపాస్తులు, రాధకు పెట్టాలి అనుకొన్న ఫర్నిచర్ అంతా రాధతోపాటు మీకు అప్పగిస్తాము. ఇంక రాధ మా అమ్మాయి కాదు. మీ అమ్మాయే. అందుకే రాధ బాధ్యత అంతా మీదే. ఆనందంతో ఏదేదో వ్రాసేస్తున్నాను. మనం కల్సినప్పుడు అన్ని విషయాలు ఇంకా వివరంగా మాట్లాడుకొందాం. లెటరు అందిన వెంటనే మీ అంగీకారంతో ఫోను చేస్తారని ఆశిస్తున్నాను. మీరు అన్నయ్యగారిని మీ సమర్థతతో ఈసారికి ఒప్పించే ఉంటారని అనుకొంటున్నాను. ఈ లెటరు పోస్ట్ చేస్తే లేట్ అవుతుంది. అందువల్ల మనిషిని పెట్టి పంపిస్తున్నాను. మీ అంత బాగా నేను వ్రాయలేదేమో.. చి. భార్గవకు ఆశీస్సులు. అన్నయ్యగార్కి నమస్కారములు. మీ ఫోను కోసం ఎదురుచూస్తుంటాను.

మీ కాబోయే వియ్యపురాలు
రత్నవల్లి. ★

జ్యోతి సతీష్